సాక్షి కామారెడ్డి

సోమవారం। 14। జూలై। 2025



విద్యార్థినులు బాగా చదివి..
విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరేలా చూడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు.
- 8లో ▸



బీసీల కోసమే..
బీసీలు రాజకీయంగా ఎదగాలన్న ఉద్దేశం తోనే రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కలిపిస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.2 /23.3
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాచారెడ్డి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ప్రజలకు సూచించారు. ఆదివారం పాల్వంచ మండలం భవానీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిసాన్‌నగర్‌ను సందర్శించారు. గ్రామంలో డెంగీ విజృంభించి 20 మందికి పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో గ్రామాన్ని సందర్శించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. డెంగీ బాధితులు ఆందోళనకు గురికావొద్దన్నారు. ఆయన వెంట మాచారెడ్డి వైద్యాధికారి ఆదర్శ్, సిబ్బంది ఉన్నారు.

నాగారంలో చిరుత సంచారం



నిజామాబాద్ సిటీ: నగరంలోని నాగారం శివారులో ఆదివారం చిరుత సంచరించింది. సాయంత్రం 6 గంటల సమయంలో డంపింగ్ యార్డు సమీపంలోని 300 క్వార్టర్స్ కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద చిరుతపులిని స్థానికులు గమనించారు. కొందరు తమ ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు తీశారు. కాలనీ సమీపంలోకి చిరుత రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదని తెలిపారు.

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి



ఖలీల్‌వాడి: ప్రజలకు న్యాయం అందించడంలో కోర్టు డ్యూటీలో ఉండే పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని సీపీ సాయి చైతన్య అన్నారు. కోర్టు సమయానికి హాజరై సాక్షులను సురక్షితంగా హాజరుపర్చి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. నగరంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో ఆదివారం సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. నైతిక విలువలు పోలీసుల క్రమశిక్షణను ప్రతిబింబిస్తాయన్నారు. నిజాయితీ, నిబద్ధతతో సేవలందించాలన్నారు. ప్రధాన కేసులలో ఎస్సై, సీఐ, ఏసీపీలతో బ్రీఫింగ్ చేయించాలన్నారు. సమన్లు, వారెంట్స్ ఎప్పటికప్పుడు ఇవ్వాలని, కోర్టులో చార్జ్‌షీట్ వేసే ముందు అన్ని పత్రాలు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, కోర్ట్ లైజన్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకు బోనం.. ఆషాఢ వైభవం



శెట్పల్లి సంగారెడ్డిలో బోనాల ఊరేగింపులో విన్యాసం



జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

కామారెడ్డిటౌన్/దోమకొండ/లింగంపేట: జిల్లాలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దోమకొండలోని చాముండేశ్వరి ఆలయంలో మహంకాళి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గటం ఊరేగింపు, భవిష్యవాణి నిర్వహించారు. మధ్యాహ్నం బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. సుమారు 4 వేల బోనాలను అమ్మవారికి సమర్పించారని ఆలయ ప్రధాన అర్చకులు భావి శరత్‌చంద్ర శర్మ తెలిపారు.

ప్రతి ఇంటినుంచి డప్పుచప్పుళ్లతో బోనాలను ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దోమకొండ ఎస్సై ప్రవంతి, భిక్కనూరు ఎస్సై అంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, ప్రతినిధులు ఉత్సవాలలో పాల్గొన్నారు.



దోమకొండలోని మహాకాళి ఆలయం లోపల బోనాలతో మహిళల ప్రదక్షిణ

పెద్దపులి.. అలజడి



రెడ్డిపేట ఫారెస్ట్‌లో గాలిస్తున్న అటవీ సిబ్బంది



ఉమ్మడి జిల్లావాసులను పెద్దపులి వణికిస్తోంది. సిరికొండ, రామారెడ్డి, మాచారెడ్డి అటవీ ప్రాంతంలో నాలుగైదు రోజులుగా పులి సంచారం కనిపిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

- ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో పాదముద్రలు
- ఆచూకీ కోసం గాలిస్తున్న ఫారెస్ట్ అధికారులు
- భయాందోళనల్లో అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లావాసులకు ఇప్పటివరకు చిరుతల సంచారం గురించి మాత్రమే తెలుసు. కానీ ఇప్పుడు పెద్దపులి సంచారానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. సిరికొండ, రామారెడ్డి, మాచారెడ్డి మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో నాలుగైదు రోజులుగా పులి సంచరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అటవీ అధికారులు.. పులి సంచరించిందన్న ప్రాంతాలలో పాదముద్రలు పరిశీలించారు. సిరికొండ, రామారెడ్డి, మాచారెడ్డి మండలాల పరిధిలోని సరిహద్దు అటవీ ప్రాంతంలో పులి సంచరించినట్టు నిర్ధారించుకున్న అధికారులు.. పులి ఎటువైపు వెళ్లిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట స్కూల్ తండా, బట్టు తండా, మద్దికుంట, అన్నారం, ఎల్లంపేట, సిరికొండ మండలంలోని తూంపల్లి, కొండాపూర్ తదితర గ్రామాలకు ఆనుకుని అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సిరికొండ వైపు నుంచి రెడ్డిపేట తండాలకు సమీపంలోని అటవీ ప్రాంతం వైపునకు పులి వచ్చినట్లు భావిస్తున్నారు.

వచ్చింది ఎస్12..!

ఉమ్మడి జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పులిని ఎస్12 గా గుర్తించారు. నాలుగు నుంచి ఐదేళ్ల వయసు ఉంటుందని అటవీ శాఖ వర్గాలు తెలిపాయి. కవ్వాల్ టైగర్ జోన్ నుంచి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది రెడ్డిపేట, అన్నారం, మద్దికుంట, తూంపల్లి, కొండాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతంలో పులి ఎటువైపు వెళ్లిందన్నదాని గురించి ఆదివారం ఉదయం నుంచి గాలించారు. రాత్రి పూట కూడా అధికారులు అటవీ ప్రాంతంలోనే మకాం వేశారు. కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ రేంజీలకు చెందిన అధికారులు, సిబ్బంది పులివేటలో నిమగ్నమై ఉన్నారు.

పశువుల కాపరుల్లో ఆందోళన

అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన పశువులను అడవిలో మేతకు తీసుకువెళతారు. అలాగే మేకలు, గొర్రెలు కూడా అటవీ ప్రాంతంలోనే మేతకు తీసుకువెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తారు. పులి సంచరిస్తోందని, పశువుల మీద దాడి చేసిందన్న ప్రచారంతో పశువులు మేపేవారితో పాటు గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు. పులి ఏవైపు వెళ్లిందో తెలిస్తే జాగ్రత్త పడవచ్చని అంటున్నారు.

భయంభయంగా..

పులి సంచారంతో అటవీ ప్రాంత గ్రామాలు, తండాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అప్పట్లో చిరుతల సంచరిస్తున్నాయన్న ప్రచారంతో కొంత భయపడ్డారు. ఇప్పుడు పులి తిరుగుతోందని తెలిసి ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని పంట చేలు ఉన్న రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. వర్షాకాలం పంటల సాగు పనులు కొనసాగుతున్న సమయంలో పులి సంచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. పగటిపూట చేను దగ్గరకు వెళితే ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తుందోనని భయపడుతున్నారు.

కదిలొచ్చిన అమ్మ

- ఇందూరులో ఘనంగా ఊరపండుగ
- హోరెత్తిన 'పులోరియా' నినాదాలు



ఖిల్లా వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల

నిజామాబాద్ రూరల్: గ్రామ దేవతలు కదిలొచ్చిన వేళ ఇందూరు నగరం పులకించింది. తమ తమ ప్రాంతాలను సల్లంగా కాపాడాలని కోరుతూ నగరవాసులు అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్ఠించారు. సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను నగరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖిల్లా రామాలయం వద్దనున్న శారదాంబ గద్దె నుంచి అమ్మవార్లు బయలెల్లగా.. ముందు వరుసలో 'సరి' గుల్ల ముందుకుసాగింది. కదిలొస్తున్న అమ్మవార్లను చూస్తూ తన్మయత్వంతో నగరవాసులు 'పులోరియా' అంటూ నినాదాలను హోరెత్తించారు. డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, తొట్లెల ఊరేగింపు, శివసత్తుల పూనకాలతో నగరవీధులు హోరెత్తాయి. శారదాంబ గద్దె నుంచి రాట్నం, చక్రం, పెద్దమ్మ, పోడాలమ్మ, మహాలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, కొండల రాయుడు, భోగస్వామి, సమ్మక్క, సారక్కలు తరలిరాగా.. పెద్దబజార్, ఆర్యసమాజ్, జెండాగల్లి, వినాయక్‌నగర్, మహాలక్ష్మినగర్, దుబ్బ ప్రాంతాల వైపు శోభాయాత్ర కొనసాగింది. ఊరపండుగలో ప్రత్యేకమైన సరి(పదార్థం)ని భక్తులు ఇళ్లపై చల్లుకున్నారు. భక్తులు దారి పొడవునా యాటలను బలిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతలను పూజించారు. ఊరపండుగను పురస్కరించుకొని ఇందూరు నగరమంతా జనసంద్రంగా మారింది. శారదాంబ గద్దె వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బట్టు రాజేశ్వర్, కో కన్వీనర్ ఆడె ప్రవీణ్, నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.



నగరంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చేపల కౌలు చెల్లింపులో జిల్లా టాప్

- 765 చెరువులకుగాను రూ. 13.86 లక్షలు..
- రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిన కామారెడ్డి

నిజాంసాగర్: మత్స్యకార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న చేపల చెరువులు, రిజర్వాయర్లు, ప్రధాన జలాశయాల్లో చేపల పెంపకానికి సంబంధించిన కౌలు చెల్లింపులో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 2024–25 సంవత్సరంలో 765 చెరువులకుగాను రూ. 13.86 లక్షల కౌలు చెల్లించడం ద్వారా జిల్లా టాప్‌లో ఉంది.

జిల్లాలో 765 చెరువుల్లో చేపల పెంపకం ద్వారా మత్స్యకార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం చేప పిల్లలను వందశాతం సబ్సిడీపై సరఫరా చేస్తోంది. అయితే చెరువుల్లో చేప పిల్లల పెంపకం, చేపల వేటకు సంబంధించి మత్స్యకారులు సర్కారుకు కౌలును చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాదికి సంబంధించి 765 చెరువులకుగాను రూ. 13.86 లక్షలు చెల్లించారు.

835 మందికి కొత్త లైసెన్స్‌లు..

జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు, కౌలాస్ ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్‌తో పాటు ఆయా చెరువుల పరిధిలో 1,600 మంది మత్స్యకారులు కొత్తగా లైసెన్స్‌లకోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 835 మందికి లైసెన్స్‌లు జారీ చేశారు. మత్స్యకార్మికులకు కొత్తగా లైసెన్స్‌లు ఇవ్వడంతో ప్రభుత్వానికి రూ. 1.71 లక్షల ఆదాయం సమకూరింది.



13,006 మందికి ఉపాధి..

జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు, కౌలాస్ ప్రాజెక్టు, 765 చెరువుల పరిధిలో 13,006 మంది మత్స్యకార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం ద్వారా చేపల వేటతో కుటుంబాలను పోషించుకుంటున్నారు.

మత్స్యకార్మికుల సహకారంతోనే సాధ్యం




జిల్లాలోని మత్స్యకార్మిక సంఘాలు, మత్స్యకార్మికుల సహకారంతో ఈ ఏడాది వందశాతం కౌలు వసూలయ్యింది. ప్రభుత్వానికి రూ. 13.86 లక్షల కౌలు చెల్లించడం ద్వారా జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. కౌలాస్ ప్రాజెక్టులో చేపల వేటకు సంబంధించి టెండర్ ప్రక్రియ చేపట్టడంతో రూ. 4.45 లక్షలు ప్రభుత్వానికి అదనపు ఆదాయం వచ్చింది. – శ్రీపతి, ఎఫ్‌డీవో, కామారెడ్డి

'స్థానిక' రిజర్వేషన్లపై ఉత్కంఠ!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని సర్కారు ఇప్పటికే పేర్కొంది. న్యాయపరమైన చిక్కులను దాటుకుని రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడంతో బీసీల్లో ఆశలు పెరిగాయి. రిజర్వేషన్లు అమలైతే పంచాయతీలు, పరిషత్‌లలో బీసీల ప్రాతినిధ్యం పెరగనుంది.

- జిల్లాలో 532 సర్పంచ్, 233 ఎంపీటీసీ స్థానాలు
- 25 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు, 4,656 పంచాయతీ వార్డులు
- 42 శాతం రిజర్వేషన్ అమలైతే పెరగనున్న బీసీల ప్రాతినిధ్యం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ఇటీవల 42 శాతం రిజర్వేషన్లకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యాయపరమైన చిక్కులను దాటుకుని ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. ఇది కార్యరూపం దాల్చితే ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కు రిజర్వేషన్లు అమలవుతాయి. ఊరూరా బీసీలకు అనేక అవకాశాలు దక్కనున్నాయి.

జిల్లాలో 532 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు అమలవుతాయి. గత ఎన్నికల్లో పంచాయతీలుగా ఏర్పడిన గిరిజన తండాలన్నింటికీ ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేశారు. అప్పుడు 68 పంచాయతీల్లో సర్పంచ్‌లతో పాటు, వార్డు స్థానాలను గిరిజనులకే కేటాయించారు. తర్వాత అవి పోను మిగిలిన వాటిలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేశారు. తరువాత బీసీలకు కేటాయించారు. ఇప్పుడు అదే పద్ధతి అవలంబిస్తే జిల్లాలో పంచాయతీల్లో దాదాపు 150 కిపైగా సర్పంచ్ పదవులు బీసీలకు దక్కనున్నాయి. అలాగే 4,656 వార్డు స్థానాల్లో 1,900 లకుపైగా బీసీలకు దక్కుతాయని భావిస్తున్నారు.

జిల్లాలో 25 మండలాలున్నాయి. ఆయా మండలాలకు ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ పదవులకు రిజర్వేషన్ల లెక్కలు గడతారు. ఎస్సీ, ఎస్టీలకు ఆరు స్థానాలుపోగా మిగతా వాటిలో తొమ్మిది పది స్థానాలు దక్కే అవకాశాలున్నాయి. జిల్లాలో 233 ఎంపీటీసీ స్థానాలుండగా.. అందులో బీసీలకు 90కిపైగా స్థానాలు దక్కనున్నాయి. జనరల్ స్థానాల్లోనూ బీసీలు పోటీ చేయడానికి అవకాశాలుంటాయి.

యంత్రాంగం రెడీ..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం రెడీ అవుతోంది. గతంలోనే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల సిబ్బంది నియామకం వరకు అన్ని ప్రక్రియలు పూర్తయి ఉన్నాయి. పోలీస్ శాఖ కూడా ఎన్నికల సందర్భంగా గొడవలు జరుగకుండా చూడడానికి గాను ముందస్తు చర్యలకు ఉపక్రమిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధమై ఉంది.

మహిళలకు సగం స్థానాలు..

స్థానిక సంస్థల్లో గతంలోలాగే మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలుకానుంది. జిల్లాలో 13 చొప్పున ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నాయి. 117 ఎంపీటీసీ స్థానాలు, 266కుపైగా సర్పంచ్ పదవులు, 2,328 వార్డు స్థానాలు మహిళలకు కేటాయించనున్నారు.

క్లుప్తంగా

బోనం ఎత్తిన పోచారం



రుద్రూర్: మండల కేంద్రంలో బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బోనం ఎత్తుకుని ఊరేగింపు ప్రారంభించారు. కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు బోనాలను ఊరేగించి గ్రామ దేవతలకు సమర్పించారు.

రెండో టౌన్ ఎస్సైగా ముజాహిద్



ఖలీల్‌వాడి: నగరంలో రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ముజాహిద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా మావల పీఎస్ నుంచి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు పనిచేసిన ఎస్సై ఇమ్రాన్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

జిల్లాలో పౌర సన్మానం పొందిన 'కోట'



నిజామాబాద్ రూరల్: విలక్షణ నటుడిగా పేరు పొందిన కోట శ్రీనివాస్‌కు ఇందూరు నగరంతో అనుబంధం ఉందని ప్రముఖ నాటక ప్రయోక్త శ్రీపాద కుమార శర్మ అన్నారు. అనారోగ్యంతో కోట శ్రీనివాస్ ఆదివారం మృతి చెందారని, ఆయన మృతి సినీరంగానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. 2012లో ఇందూరులో శ్రీపాద నాటక కళా పరిషత్ నాటక పోటీలు జరిగాయని వీటికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట శ్రీనివాస్‌రావును పౌర సన్మానం చేసినట్లు తెలిపారు. చిత్రపరిశ్రమ గొప్ప కళాకారుడిని కోల్పోయిందన్నారు విచారం వ్యక్తం చేశారు. చంద్రశేఖర శర్మ, వీపీ చందన్ రావు, సంస్కార భారతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సముద్రాల మధుసూదన చారి, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీశ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ ప్రేమ్‌లాల్ ఆయన మృతికి సంతాపం తెలిపారు.

బోధన్‌వాసికి స్వర్ణ కంకణ పురస్కారం



బోధన్‌టౌన్: జ్యోతిష్య శాస్త్రంలో విశేష కృషి చేస్తున్న బోధన వాస్తవ్యుడైన యోగిరాజ్ వైద్యకు స్వర్ణ కంకణ పురస్కారం లభించింది. ఆదివారం వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానసభలో తెలుగు సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు యోగిరాజ్‌కు స్వర్ణ కంకణ పురస్కారం అందించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు.

బోనస్ కోసం రైతుల నిరీక్షణ

- మోర్తాడ్‌కు చెందిన రైతు కొప్పల రాజశేఖర్ అతని కుటుంబసభ్యులు కలిసి స్థానిక సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో ఏప్రిల్ 24న 280 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యంను విక్రయించారు. ధాన్యం సొమ్ము వారం రోజుల వ్యవధిలో సంబంధిత రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. బోనస్‌కు సంబంధించి రూ.1.40 లక్షలు జమ కావాల్సి ఉండగా ఇప్పటి వరకూ నయాపైసా చెల్లింపులు జరుగలేదు.
- ఏర్గట్లకు చెందిన రైతు ఉపేంద్ర 72 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అతనికి రూ.36వేల బోనస్ సొమ్ము జమ కావాల్సి ఉంది.

- కొనుగోళ్లు పూర్తయినా మొదలుకాని చెల్లింపులు
- నగదు కోసం ఎదురుచూపులు
- సన్నరకాల బోనస్‌ను చెల్లిస్తామని సర్కారు హామీ



మోర్తాడ్‌లో వరి తూకం వేస్తున్న కూలీలు

మోర్తాడ్(బాల్కొండ): బోనస్ వస్తుందనే ఆశతోనే యాసంగిలో సన్నరకాలను సాగు చేసిన రైతులు ఆ డబ్బులు చేతికి అందక నిరాశ చెందుతున్నారు. సన్నరకాల సాగును ప్రోత్సహించేందుకు ప్రతి క్వింటాలుకు రూ.500 ల బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం విదితమే. గత వానాకాలం సీజన్‌లో బోనస్ చెల్లించడంతో అదే ఉత్సాహంతో రైతులు యాసంగి సీజన్‌లోనూ సన్నరకాలనే సాగు చేశారు. దీంతో సన్నరకాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా రైతులకు 7,38,662 మెట్రిక్ టన్నుల సన్నరకాలకు సంబంధించిన రూ.369.33కోట్ల బోనస్ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి బోనస్ నిధులను వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు. బోనస్ సొమ్ము అందితే ప్రస్తుత సీజన్‌లో పంటల సాగుకు పెట్టుబడి కోసం దిక్కులు చూడాల్సిన అవసరం ఉందని చెప్తున్నారు.

ఎగ్గొట్టాలని చూస్తున్నారు



సన్నరకం వరి సాగు చేసిన రైతులను ప్రోత్సహిస్తామని నమ్మించిన ప్రభుత్వం ధాన్యం విక్రయించిన తర్వాత బోనస్ ఎగ్గొట్టాలని కుట్ర పన్నుతుంది. బోనస్ సొమ్ము అందితే వానాకాలం సీజన్ పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– పాపాయి పవన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మోర్తాడ్

రైతులను వంచించడం తగదు



బోనస్ చెల్లించకుండా రైతులను వంచించడం తగదు. రైతుభరోసా డబ్బులు చెల్లించి బోనస్ ఇవ్వకుండా చేతులు దులుపుకోవడం సరైంది కాదు. బోనస్ కచ్చితంగా చెల్లించాలి. లేకుంటే ఆందోళన తప్పదు.


– ఏనుగు రాజేశ్వర్, రైతు నాయకుడు, మోర్తాడ్

ప్రభుత్వానికి వివరాలు ఇచ్చాం

కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందించాం. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాగానే బోనస్‌కు సంబంధించిన సొమ్ము జమ అయ్యే అవకాశం ఉంది.

– అరవిందరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

23 దేశాల కరెన్సీ.. 25 దేశాల స్టాంప్స్ సేకరణ



గంగాధర్ దంపతులు సేకరించిన వివిధ దేశాల కరెన్సీ, నాణేలు





వివిధ దేశాల స్టాంపులు

- కాకతీయులు, నిజాం కాలం నాటి నాణేలు
- బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ గుట్ట గంగాధర్ దంపతులు





సేకరించిన నిజాం, కాకతీయుల కాలం నాటి నాణేలు



గంగాధర్, త్రివేణి దంపతులు

డిచ్‌పల్లి: అతడి వృత్తి పోలీసు.. ప్రవృత్తి వివిధ దేశాల నాణేలు.. కరెన్సీ, స్టాంపుల సేకరణ. ఈ సేకరణలో అతడి భార్య సహకారం ఎంతో ఉంది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు ఏడో బెటాలియన్‌లో గుట్ట గంగాధర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గంగాధర్ భార్య త్రివేణి గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఇద్దరికీ స్టాంపులు, నాణేలు, కరెన్సీల సేకరణ అంటే ఇష్టం. ఈ దంపతుల కుటుంబ సభ్యులలో పలువురు విదేశాలకు వలస వెళ్లారు. వారి ద్వారా అక్కడి దేశాల స్టాంపులు, నాణేలు, కరెన్సీ సేకరించారు. అలాగే స్నేహితులు, తెలిసిన వారి ద్వారా వివిధ దేశాల స్టాంపులు, నాణేలు, కరెన్సీ సేకరించారు. ఇలా 2003 నుంచి 23 దేశాల నాణేలు, కరెన్సీతో పాటు 25 దేశాలకు చెందిన స్టాంపులు సేకరించారు. సేకరించిన నాణేలలో కాకతీయుల కాలంతో పాటు 1939 సంవత్సరం నిజాం కాలం నాటి నాణేలు, రూపాయలు ఉన్నాయి. వీరు సేకరించిన నాణేలు, కరెన్సీలలో భారతదేశం తో పాటు యూఎస్‌ఏ, యూకే, మలేషియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, జోర్డాన్, టర్కీ, ఇటలీ, పోలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఖతర్, బహ్రెయిన్, యూఏఈ, కువైట్, సౌదీ అరేబియా తదితర దేశాలకు చెందినవి ఉన్నాయి. స్టాంపులలో ఇండియాతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, యూఎస్‌ఏ, యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, టర్కీ, మాల్టా, సింగపూర్, ఈజిప్ట్, ఫిలిప్పీన్స్, ఇటలీ తదితర దేశాలవి ఉన్నాయి. వీటి సేకరణ కోసం గంగాధర్ దంపతులు చాలా మంది వ్యక్తులను కలిశారు. పోలీసు ఉద్యోగం రాకముందు గంగాధర్ కూడా ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో ప్రైవేట్ టీచర్‌గా పని చేశారు. అప్పుడే ఆయనకు ఈ సేకరణపై ఇష్టం ఏర్పడింది. గత చరిత్ర, పాలకుల వైభవాలకు గుర్తు అయిన కాకతీయ, నిజాం కాలం నాటి నాణేల సేకరణతో మొదలుపెట్టాడు. ప్రస్తుతం తమ ఇంటికి ట్యూషన్‌కు వచ్చే బాల, బాలికలకు వీటి గురించి వివరిస్తారు.

అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులు ఒకేచోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుసుమ బాల్‌కిషన్, సీహెచ్ వెంకటరాజయ్య, గోవింద్ లాల్, దిగంబర్, చంద్రకాంత్, యాద రమణారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సన్నబియ్యంతో పాశం చేసుకున్నం సారూ...



భాగిర్తిపల్లి గ్రామంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో మాట్లాడుతున్న పెద్దోళ్ల పోచవ్వ

భిక్కనూరు: 'కంట్రోలు షాపుల నుంచి ఇచ్చిన సన్నబియ్యం పుణ్యాన మొన్న జరిగిన ఏకాశి పండుగకు పాశం చేసుకున్నాం సారూ'.. అంటూ భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో అన్నారు. మండలంలోని భాగిర్తిపల్లిలో ఆదివారం జరిగిన ముత్యాలమ్మ పండుగకు షబ్బీర్ అలీ హాజరై, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షబ్బీర్‌అలీ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళల వద్దకు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు, తమ ఇళ్లకు ఉచిత కరంట్, రైతు భరోసా రుణమాఫీ అందాయని పలువురు మహిళలు షబ్బీర్ అలీకి వివరించారు. అలాగే పెద్దోళ్ల పోచవ్వ అనే మహిళ మాట్లాడుతూ.. సన్నబియ్యం వల్ల ఎంతో మేలు కలుగిందని అన్నారు. గతంలో ఇంటికి చుట్టపోళ్లు వస్తే దుకాండ్లకు వెళ్లి సన్న బియ్యం కొనుక్కొని వచ్చి అన్నం వండే వారమని, ఇప్పుడు సన్నబియ్యం కోసం దుకాండ్లకు వెళ్తలేమని షబ్బీర్‌తో అన్నారు.

విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి



కేజీబీవీలో తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని వంట గదులు, తరగతి గదులు, సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులు తమ సమస్యలను తెలియజేయాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే కేజీబీవీలో రూ.3.5 కోట్ల నిధులతో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు శ్రీకాంత్, సత్యనారాయణ, నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సామెల్, విద్యాసాగర్, అరుణ, వాసవి, వెంకటేశం, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ ప్రమీల, స్పెషల్ ఆఫీసర్ వీణ తదితరులు ఉన్నారు.



ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వైభవంగా ఊరపండుగ



నగరంలో ఊరపండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఖిల్లా రామాలయం వద్ద నున్న శారదాంబ గద్దె నుంచి అమ్మవార్లు బయలు దేరాయి. కదిలొస్తున్న అమ్మవార్లను చూస్తూ తన్మయత్వంతో నగరవాసులు 'పులోరియా' అంటూ నినాదాలను హోరెత్తించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, తొట్లెల ఊరేగింపు, శివసత్తుల పూనకాలతో నగరవీధులు హోరెత్తాయి. – సాక్షి నెట్‌వర్క్

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



తాడ్వాయి: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బీర్ల సిద్ధయ్య(44) కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్లగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని రుద్రారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రుద్రారం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.4500 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్ తండాకు చెందిన బాదావత్ పీర్‌సింగ్ అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సుస్మిత ఆదివారం తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న కంటెయినర్



ప్రమాదానికి కారణమైన కంటెయినర్



దేవేంద్రసింగ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

డిచ్‌పల్లి: ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటెయినర్ ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్ స్వల్పగాయాల పాలైయ్యాడు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరు నుంచి మోటారు బైక్‌ల లోడ్‌తో మధ్యప్రదేశ్‌కు కంటెయినర్ వెళ్తోంది. డిచ్‌పల్లి నాగ్‌పూర్ గేటు వంతెన మూలమలుపు వద్ద మోటారు బైక్‌ల లోడ్‌తో ఉన్న పెద్ద ట్రక్కు క్యాబిన్ ఎడమ వైపు అద్దం పగిలి పోవడంతో డ్రైవర్ రోడ్డుపక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో బెంగుళూరు నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న కంటెయినర్ డ్రైవర్ నిద్రమత్తులో నిలిపి ఉన్న ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కంటెయినర్ అదుపుతప్పి డివైడర్ పై నుంచి అవతలి పక్కకు దూసుకెళ్లి పక్కనున్న బారికేడ్‌ను ఢీకొని నిలిచిపోయింది. కంటెయినర్‌లో ఇద్దరు డ్రైవర్లు ఉండగా ఆ సమయంలో ఓంప్రకాష్ నడుపుతున్నాడు. ప్రమాదం జరిగినప్పుడు క్యాబిన్ ఎడమవైపు డోర్ ధ్వంసం కావడంతో అటువైపు కూర్చున్న మరో డ్రైవర్ దేవేంద్రసింగ్(45) అందులోంచి కిందపడగా కంటెయినర్ టైర్లు అతడిపై నుంచి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంప్రకాశ్, దేవేంద్రసింగ్ ఇద్దరు అన్నదమ్ములు.. రాజస్తాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన వారు. ఓంప్రకాశ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఆర్మూర్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్లే రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో మరో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. లేదంటే డివైడర్ పై నుంచి అటు వైపు దూసుకెళ్లిన కంటెయినర్ కు ఢీకొని మరో ప్రమాదం జరిగి ఉండేది. సమాచారం అందుకున్న ఎస్సై షరీఫ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దేవేంద్రసింగ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్ ఓంప్రకాశ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆగి ఉన్న ట్రక్కులోని వారికి ఏమీ కాలేదు. ట్రక్కు వెనకభాగంలో కంటెయినర్ ఢీకొట్టడంతో అందులో ఉన్న కొన్ని మోటారు బైకులు దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగు పనుల్లో భోజన విరామం



భిక్కనూరు: మండలంలో వర్షకాల వ్యవసాయ సాగు పనుల జోరుగా కొనసాగుతున్నాయి. పనుల్లో మహిళ కూలీలు, రైతులు అధికంగా హాజరవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు కొనసాగుతుండటంతో వారు మధ్యాహ్న భోజనాన్ని సద్దులు కట్టుకొని, పని ప్రదేశాల్లోనే భోజనం చేస్తున్నారు. భిక్కనూరు మండల కేంద్రం సమీపంలో మహిళ వ్యవసాయ కూలీలు వరి నాట్లు వేసి, మధ్యాహ్నం పొలం గట్టు పక్కన ఉన్న రోడ్డుపై కూర్చుండి భోజనం చేశారు. తోటివారితో ముచ్చట్లు పెట్టుకుంటూ పని అలసటను మర్చిపోయారు. ఈ చిత్రాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.